31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

మంగళవారం,అక్టోబర్ 27 , 2026 పేజీలు : 8

## పెట్రోల్ బంక్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 26 :** జగిత్యాల పట్టణంలోని తహసీల్దార్ ఆఫీస్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన జగిత్యాల కలెక్టరేట్ ప్రభుత్వ పెట్రోల్ బంక్ ను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సోమవారం ప్రారంభించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారి సహకారంతో ఈ పెట్రోల్ బంక్‌ను ఏర్పా టు చేశారు. పట్టణంలోని తహసీల్దార్ ఆఫీస్ చౌరస్తాకు వచ్చే ప్రజలు, అధి కారులు, ఉద్యోగులు, వాహనదారులకు ఇంధనాన్ని సులభంగా అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా దీనిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెట్రోల్ బంక్‌లో నాణ్యత ప్రమాణాలు, సరైన కొలతలు, భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన సేవలు అందించాలని, పెట్రోల్ బంక్ నిర్వహణలో పారదర్శకత పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## ఇంటిగ్రేటెడ్ పేరిట రిజర్వేషన్లు ఎత్తేస్తారా?

**-రేవంత్ పాలనలో విద్యా వ్యవస్థ నాశనం**
**-మూడేళ్లలో 1000 పాఠశాలలు మూతపడ్డాయి**
**మాజీ మంత్రి జీవన్ రెడ్డి**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 26 :** రేవంత్ పాలనలో విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నారని, మూడేళ్లలో 1000 పాఠశాలలు మూతపడ్డాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి విమర్శించారు.జగిత్యాల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్ లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ పాలనలో 652 కొత్త గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశామని, ఉమ్మడి రాష్ట్రంలో 261 గురుకులాలు ఉంటే అదనంగా 652, బీసీ రెసిడెన్షియల్ 19 ఉంటే అదనంగా 262, మైనారిటీ 12 ఉంటే 194, ఎస్సీ 134 ఉంటే అదనంగా 134 మంజూరు చేశామని తెలిపారు. ప్రతి గురుకులాన్ని ఇంటర్మీడియట్ కళాశాలగా అప్ గ్రేడ్ చేసి ఏటా 52,160 మందికి అవకాశం కల్పించామన్నారు. రేవంత్ రెడ్డి విద్యా శాఖ మంత్రిగా ఉండి మూడేళ్లలో ఒక్క రెసిడెన్షియల్ స్కూల్ కూడా ప్రారంభించలేదని, ఒక్క అడ్మిషన్ ఇవ్వలేదని విమర్శించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ పేరిట విద్యా వ్యవస్థను కేంద్రీకరిస్తున్నారని, అక్కడ కొత్త అడ్మిషన్లు లేవని, రిజర్వేషన్లను ఎత్తేసే ప్రయత్నం చేస్తున్నారా అని ప్రశ్నించారు. పరిపాలన వికేంద్రీకరణ జరగాల్సి ఉండగా విద్యను కేంద్రీకరించడం సరికాదని, సింగరావుపేట, లక్ష్మీపూర్ వంటి చోట్ల ఉన్న గురుకులాలకు పక్కనే భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. చల్గల్ వ్యవసాయ ప్రదర్శన క్షేత్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు 20 ఎకరాలు కేటాయించకపోవడాన్ని తప్పుబట్టారు. తాటిపల్లి గుట్టల్లో వేలాది చెట్లు నరికి గుట్టను ధ్వంసం చేయడం ఏమిటని, 200 కోట్ల బడ్జెట్ లో 10 కోట్లు వెచ్చించి భూమి కొనుగోలు చేసి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. కేసీఆర్ మూడేళ్లలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే, రేవంత్ ప్రభుత్వం మూడేళ్లలో కనీసం మరమ్మతులు కూడా చేయలేదని, కన్నెపల్లి వద్ద కాపర్ డ్యాం నిర్మించి ప్రాణహిత జలాలను వినియోగించుకోవాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు దావ సురేష్, అయిల్నేని వెంకటేశ్వర రావు, ఆనంద్ రావు, ఆవారీ శివ కేసరి బాబు, దేవేందర్ నాయక్, కోరుకంటి రాము,శీలం ప్రవీణ్ కుమార్, గంగారెడ్డి, అయిల్నేని ఆనంద్ రావు కళ్ళపల్లి దుర్గయ్య, మున్నా, పుప్పాల అశోక్,రజనీకాంత్, జున్ను రాజేందర్,పొట్టవత్తిని సతీష్, పల్లె రవి,బాలె రవి, ధరా రమేష్ బాబు, చందా రాధా కిషన్, బారి, నక్క జీవన్, శీలం సురేందర్, శ్రీరామ్ గంగాధర్, మామిడిపల్లి మహిపాల్,వెంకట్ రెడ్డి,కట్కూరి రాజేందర్, చింతకింది నరేష్, అసిఫ్, గాజుల శ్రీనివాస్,ధర్మయ్య, గుండ మధు,అభి, ముద్దం రాజిరెడ్డి, పాల్గొన్నారు.

### ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి

## ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది



**-జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్‌కుమార్**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 26:** రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామంలో రూ.20 లక్షల నిధులతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని సోమవారం జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, పంచాయతీ భవనాలు ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించేందుకు ఉపయోగపడతాయన్నారు. రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితమని, అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతో పేదల సొంతింటి కల సాకారమవుతోందని, త్వరలో ఎల్ నినో పరిస్థితులు సూపర్ ఎల్ నినోగా మారబోతున్నందున ప్రజలు అప్రమ త్తంగా ఉండి కరెంటు, నీటిని పొదుపు గా వాడాలని, రైతులు ఆరుతడి పంటల సాగు వైపు -మిగతా 2లో

### బాధితుల సమస్యల

## తక్షణ పరిష్కారానికి చర్యలు

**జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 26 :**బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటూన్నామని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 15 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, పోలీస్ స్టేషన్ కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్టపరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, ఫిర్యాదుదారునికి భరోసా, నమ్మకం కలిగించాలన్నారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

### వాల్మీకి జీవితం

## సృష్టి ఉన్నంత వరకు స్ఫూర్తిదాయకం

**జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 26:** మహర్షి వాల్మీకి జీవితం ఈ సృష్టి ఉన్నంత కాలం స్ఫూర్తినిస్తూనే ఉంటుందని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు.సోమవారం జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామంలో వాల్మీకి బోయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. వాల్మీకి కీర్తి ప్రతిష్టలను జయంతి సందర్భంగా స్మరించుకోవడం మన పూర్వజన్మ సుకృతమని, సామాన్య ప్రజలకు అర్థమయ్యేలా రామాయణాన్ని రచించిన వాల్మీకిని అందరూ గుర్తుంచుకోవాలని కోరారు. మన ధర్మాన్ని కాపాడుకుంటూ ఇతర మతాలను గౌరవించాలని అన్నారు. బ్రిటిష్ వారి హయాంలో మన సంస్కృతి, సంప్రదాయాలు, గ్రంథాలను కనుమరుగు చేసే ప్రయత్నం జరిగిందని, గ్రామంలో వాల్మీకి ఆలయ నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు భూమిపూజ, రూ.235 కోట్లతో ఆసుపత్రి పనులు జరుగుతున్నాయని, అంతర్గాం గ్రామానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేశామని, లింగం చెరువును సుందరీకరించామని తెలిపారు. అనంతరం గ్రామానికి చెందిన మండల దేవయ్యకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని అందజేశారు.సర్పంచ్ నోముల రమ్య శేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్ బాలు గౌడ్, మాజీ సర్పంచులు నక్కల రవీందర్ రెడ్డి, బోనగిరి నారాయణ, ఏఎంసి డైరెక్టర్ రాజి రెడ్డి, పిఏసిఎస్ డైరెక్టర్ రాజయ్య, ఎల్లాల రాజిరెడ్డి పాల్గొన్నారు

# కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో ఎన్నికల కమిషన్



**చురకలు ( పెద్దపల్లి జిల్లా ప్రతినిధి) కమాన్ పూర్ అక్టోబర్ 26 :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రంగంపల్లి వద్ద గల ఆర్ ఆర్ వినోద్ గార్డెన్స్ లో ఎఐసీసీ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా చేపట్టిన " ఓట్ బచావో - దేశ్ బచావో " ప్రచార కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్.ఐ.ఆర్ కార్యక్రమ ఎఐసిసి పరిశీలకులు ఎస్. శరత్ , టీపీసీసీ పరిశీలకులు కూన శ్రీశైలం గౌడ్ మరియు డీసీసీ అధ్యక్షులు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ తో కలిసి రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింత కుంట విజయరమణ రావు పాల్గొన్నారు ..ఈ సందర్బంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ..ఎస్.ఐ.ఆర్ పేరుతో చీఫ్ ఎలక్షన్ కమిషన్ మరియు జ్ఞానేశ్ కుమార్ అక్రమంగా ఓట్లను తొలగిస్తున్నారని తెలంగాణ రాష్ట్రంలో కూడా 73 లక్షల ఓట్లను అక్రమంగా తొలగించారని ప్రభుత్వ విప్ విజయరమణ రావు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో ఎన్నికల కమిషన్ పనిచేస్తుందని ఓట్ల తొలగింపు అనేది అనైతిక చర్య అని అన్నారు. ఓటు అనేది దేశ పౌరుని హక్కు అని ఓటును తొలగించే హక్కు ఎవ్వరికీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 13 నియోజకవర్గాలలో టిఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన కాలేశ్వరం ప్రాజెక్టు నుంచి ఏ నియోజకవర్గానికి ఎన్ని నీళ్లు వచ్చాయో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కేటీఆర్ చెప్పాలని ప్రభుత్వ విప్ విజయరమణ రావు అన్నారు. కన్నెపల్లి నుంచి 20 వేల క్యూసెక్కుల నీరు వృధాగా కిందికి పోతుందని ఆ నీటిని మళ్లించవచ్చని తప్పుడు మాటలు మాట్లాడుతున్నాడని అన్నారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మూడు బ్యారేజీలు కట్టగా మేడిగడ్డ కూలగా అన్నారం సుందిళ్ల లీకేజీలైనాయని ఈ విషయంపై 2023లో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నాణ్యత లేని కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారులకు స్వయంగా కలిసి వినతి పత్రం కూడా అందించారు అన్నారు. ఈ ప్రాజెక్టులో నీళ్లు నింపవచ్చా అని సీఎం వారి దృష్టికి తీసుకుపోగా ఈ కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో అన్ని రకాల టెస్టులు చేసిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సేఫ్టీ వారు ఈ ప్రాజెక్టులోని బ్యారేజీలలో నీళ్లు నింపుతే ఆగే పరిస్థితి లేదని స్వయంగా నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారులు చెప్పిన విధంగా సీఎంతో పాటు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు వారు చెప్పిన విధంగా ముందుకు పోతున్నారు అని అన్నారు. కెసిఆర్ ఇంజనీర్ వారి అల్లుడు హరీష్ రావు సబ్ ఇంజనీర్ అయి కాళేశ్వరం ప్రాజెక్టు కడితే మూడేళ్లకే కూలిపోయింది అని విమర్శించారు. ఈ ప్రాజెక్టులో నీళు ఆపితే కొట్టుకపోయే ప్రమాదం ఉందని సీఎం రేవంత్ రెడ్డి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయడంతో పాటు ఛాయలు టెస్టింగ్ కూడా పూర్తి అయ్యింది అన్నారు. కేటీఆర్ హైదరాబాద్ లేదా కరీంనగర్లోనైనా చిత్తశుద్ధి ఉంటే ప్రెస్ మీట్ పెట్టి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఏ నియోజకవర్గానికి ఎన్ని నీళ్లు ఇచ్చారో చెప్పాలి అన్నారు. మంథని లో డ్యామ్ కడితే అక్కడ నీళ్లు ఉండవు, ఎల్లంపల్లి, నంది మేడారంలో రిజర్వాయర్ లో కూడా నీళ్లు ఉండవు అని, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఏ నియోజకవర్గానికి నీళ్లు ఇవ్వకుండా దొంగ లెక్క మెదక్ కు బీఆర్ఎస్ నాయకులు దోచుకపోయారు అన్నారు.నేషనల్ డ్యామ్ అథారిటీ సూచన మేరకు మూడు బ్యారేజీలు మరమ్మతులు చేసి వచ్చే జూన్ కల్లా పనులు పూర్తి చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. తుమ్మిడి హెట్టి వద్ద వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 11,500 కోట్ల ఖర్చు చేసి ప్రాజెక్టు నిర్మాణం కొనసాగించారని మరో 20 వేల కోట్లు పెట్టుబడి పెడితే లక్ష ఎకరాలకు గ్రావిడ్ ద్వారా సాగునీరు అందేదని, ఈ ప్రాజెక్టును విస్మరించి పోయే నీళ్లను ఎత్తిపోసి రివర్స్ పంపింగ్ ద్వారా సాగునీరు అందిస్తామని ఒకవైపు కేసీఆర్ మరోవైపు హరీష్ రావు తప్పుడు మాటలతో పైసల కక్కుర్తి పడి నాణ్యతలేని కాలేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు అన్నారు. ఎమ్మెల్యే వివేకానంద కన్నెపల్లి పంప్ హౌస్ తప్పుడు మాటలు మాట్లాడుతున్నాడని ఎద్దు , వ్యవసాయం అలపదాపద తెలియకుండా తెలంగాణ భవన్లో రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుతున్నాడని, తీవ్రంగా విమర్శించారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు ద్వారా ఆరు లక్షల ఎకరాలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నీరు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, కడెం ,ఎల్లంపల్లి శ్రీపాద, లోయర్ మానేరు డ్యాం, మంజీరా, వరద కాలువ ఇవన్నీ నిర్మించింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఎల్లంపల్లి పైపులైను 2013లో పూర్తి చేసి హైదరాబాదుకు ఐదు టీఎంసీల నీరు ఇస్తుంది కూడా కాంగ్రెస్ పార్టీ అన్నారు. కన్నెపెల్లి నుంచి నీరు కిందికి వరంగల్ జిల్లాలోని దేవాదుల, ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్టు కు పోతున్నాయని కేటీఆర్ తప్పుడు మాటలను మానుకోవాలి అన్నారు. కెసిఆర్ రాయలసీమలో రోజా ఇంటిలో చేపల పులుసు తిన్నప్పుడు రాయలసీమను గోదావరి నీళ్లతో సస్యశ్యామలం చేస్తామని ఆంధ్రాకు వత్తాసు పలికాడని, సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నాడు అన్నారు.ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్.,పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు, రామగుండం మేయర్, మార్కెట్ చైర్మన్లు, కార్పొరేటర్లు,పలు గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, మండల మరియు పట్టణాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## పాలకుర్తి తహసీల్దార్‌గా కోటేశ్వర్‌రావు



**చురకలు (పెద్దపెల్లి జిల్లా ప్రతినిధి)కమాన్ పూర్ అక్టోబర్ 26 :** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండల నూతన తహసీల్దార్‌గా సూదాటి కోటేశ్వర్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించారు. తాజాగా పాలకుర్తి తహసీల్దార్‌గా నియమితులై బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు పాలకుర్తి తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన సునీత మంథని ఆర్డీవో కార్యాలయానికి బదిలీ అయ్యారు. కోటేశ్వర్‌రావు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రెవెన్యూ కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.ఇందులో మండల గిర్దవర్ సంతోష్, జూనియర్ అసిస్టెంట్ మల్కారెడ్డి, జి పీ ఓ లు సంపత్, ఇస్త్యాక్, సుజాత, శ్రీనివాస్, రాజేందర్, రాజ్ కుమార్, వెంకట్ స్వామి, దివ్య భారతి, రికార్డ్ అసిస్టెంట్ మానేశ్వరి, రాజేందర్ కంప్యూటర్ ఆపరేటర్ తోట రమేష్, అటెండర్లు రాజేశ్వరి, లక్ష్మీ, మహేష్ , తిరుపతి తదితరులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## గిఫ్ట్ అందుకున్న కిరణ్



**చురకలు (పెద్దపల్లి జిల్లా ప్రతినిధి)కమాన్‌పూర్ అక్టోబర్ 26 :** కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా పెద్దపల్లి జిల్లా ఇన్చార్జి పంథనికి చెందిన ఆరెల్లి కిరణ్ గిఫ్టును అందుకున్నారు.కమాన్‌పూర్‌లోని సుభాష్‌నగర్‌లో శ్రీ దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రాలో రెండో బహుమతిగా నాలుగు పొయ్యిల గ్యాస్ స్టవ్ డ్రాలో బహుమతిగా రావడం జరిగింది.గ్యాస్ స్టవ్‌ను సుభాష్‌నగర్ యూత్ కమిటీ అందజేశారు వారికి ప్రత్యేక ధన్యవాదాలు అని కిరణ్ తెలిపారు.అమ్మవారి ఆశీస్సులు మీ అందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ఇలాంటి సేవా కార్యక్రమాలను మరెన్నో విజయవంతంగా నిర్వహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని కిరణ్ పేర్కొన్నారు.

## వైనాలను పరామర్శించిన ఏంసి వైస్‌చైర్మన్



**చురకలు (పెద్దపల్లి జిల్లా ప్రతినిధి)కమాన్‌పూర్ అక్టోబర్ 26 :** కమాన్ పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజును, హనుమకొండ ఏజీపీ వైనాల వినోద్ లను సోమవారం కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల రాజయ్య తదితరులు పరామర్శించారు.ఇటీవల రాజు తండ్రి వైనాల సాంబయ్య మృతిచెందగా పరామర్శించి సాంబయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.రాజు కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు. ఆయనతోపాటు ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ గుప్త, ముత్తారం మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు వాజిద్ పాషా,ముత్తారం సింగల్ విండో చైర్మన్ యాదగిరిరావు, లద్నాపూర్ సర్పంచ్ వనం రామచంద్రరావు, పి ఆర్ టి యు రాష్ట్ర అసోసియేట్ అఅసోసియేట్ అధ్యక్షుడు నాంపల్లి రాజ్ కుమార్,తుడిచెర్ల రాము కమాన్‌పూర్,అమీనా భాను గొల్లపల్లి,సూది రెడ్డి ప్రవళిక పెంచికలపేట, ఝాన్సీ రొంపి కుంట,జంజర్ల అమల సిద్ది పల్లె, మేడ గొని శ్రీనివాస్, మంగ సంతోష్,మండల విద్యాధికారి ఇల్లందుల విజయ్ కుమార్, ఉపాధ్యాయులు గసిగంటి రమేష్, సతీష్, కాంగ్రెస్ నాయకులు పెన్ రెడ్డి కిషన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పిల్లి శేఖర్, మాజీ సర్పంచ్ బొల్లేపల్లి శంకర్ గౌడ్, వడ్లకొండ తిరుపతి, వ్యవసాయ అధికారులు చిందం శ్రీకాంత్, గిరి రామకృష్ణ, విస్తరణ అధికారులు అరవింద్, రమేష్, నవీన్,తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి

## ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది

**మొదటి పేజీ తరువాయి...** ఆలోచన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మహేష్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గాజెంగి నందయ్య, ఆత్మ చైర్మన్ కాటిపల్లి గంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొలుగూరి దామోదర్ రావు, ఉప సర్పంచ్ లక్ష్మణ్, ఎంపీడీఓ రమాదేవి, ఎంఆర్ఓ హకీం, ఎంపీఓ రవిబాబు, ఏఈ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### సెంటినరీ కాలనీ పద్మశాలి సంఘం

## నూతన కమిటీ ఎన్నిక

**చురకలు పెద్దపల్లి జిల్లా ప్రతినిధి కమాన్ పూర్ అక్టోబర్ 26:** సెంటినరీ కాలనీ పద్మశాలి సంఘం నూతన కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో సంఘం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ ఎన్నికల్లో సంఘం అధ్యక్షుడిగా బైరి శంకర్, ఉపాధ్యక్షుడిగా వడ్నాల రఘుపతి, ప్రధాన కార్యదర్శిగా కుందారపు సంతోష్, కోశాధికారిగా తన్నీరు ప్రదీప్ ఎన్నికయ్యారు.నూతన కమిటీ ఎన్నికల ప్రక్రియను రామగిరి మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు బండారి సదానందం, ఉపాధ్యక్షుడు చిలువేరు స్వామి, ప్రధాన కార్యదర్శి ఆడెపు వైకుంఠం నిర్వహించారు.

### రైతుల సంక్షేమానికి

## నూతన పాలకవర్గాలు కృషి చేయాలి



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆక్టోబర్ 26 :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ పరిధిలోని కొలనూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) నూతనంగా నియమితులైన అధ్యక్షులు, కార్యవర్గ సభ్యుల అభినందన సభలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పీఏసీఎస్ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన పాలకవర్గాలు తమ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు.సహకార సంఘాలను మరింత బలోపేతం చేయడంతో పాటు రైతులకు అందాల్సిన సేవలను సమర్ధవంతంగా అందించేందుకు కృషి చేయాలని సూచించారు. రైతుల అవసరాలను గుర్తించి, వారికి అందుబాటులో ఉంటూ వ్యవసాయ రంగ అభివృద్ధికి నూతన పాలకవర్గాలు తోడ్పడాలని ఆకాంక్షించారు.

## ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు




**చురకలు ప్రతినిధి,జగిత్యాల,అక్టోబర్ 26 :** భారతీయ సాహిత్యానికి ఆదికవిగా,ఆధ్యాత్మిక మార్గదర్శిగా నిలిచిన మహర్షి వాల్మీకి జయంతిని సోమవారం జగిత్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ రవి కుమార్, ఆర్ఐ సైదులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

**-జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**



**చురకలు ప్రతినిధి,జగిత్యాల,అక్టోబర్ 26 :** అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థిక భరోసా కల్పిస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని 14వ వార్డుకు చెందిన గజ్జెల అపర్ణ కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.1,87,000 విలువైన చెక్కును ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ తన క్యాంపు కార్యాలయంలో సోమవారం అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్య ఖర్చులు భరించలేని పేద కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో బాధితుడి ఆవేదన

**-న్యాయం చేయాలని వినతి**



**చురకలు విలేకరి,జగిత్యాల,అక్టోబర్ 26 :** తనకు చెందిన దుకాణం విషయంలో న్యాయం జరగడం లేదంటూ మెట్ పల్లికి చెందిన ప్యాడం గోవర్ధన్ తన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు.బాధితుడు గోవర్ధన్ తెలిపిన మెట్ పల్లి-వెల్లుల్ల రోడ్డులో 2021లో తన షట్టర్ లో నలుగురు భాగస్వాములుగా మెడికల్ షాప్ ఏర్పాటు చేశామని,ఒప్పందం ప్రకారం ఐదేళ్ల గడువు ముగిసి రెండు నెలలు గడుస్తున్నా దుకాణాన్ని తిరిగి అప్పగించడం లేదని తన వినతి పత్రంలో పేర్కొన్నారు. తన భాగస్వామిని కోరినప్పుడు బెదిరింపులకు గురవు తున్నానని,షాపు వద్దకు వెళ్లేందుకు భయపడాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.తన సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని కోరుతూ అధికారులకు వినతి పత్రం అందజేశారు.బాధితుడి ఫిర్యాదును స్వీకరించిన అధికారులు తదుపరి విచారణ నిమిత్తం పోలీసుశాఖకు బదిలీ చేశారు.

# సిసి రోడ్ల నిర్మాణానికి 5 కోట్ల నిధులు మంజూరు

**-టీపీసీసీ నాయకులు జువ్వాడి కృష్ణారావు**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 26 :** 2027లో జరగనున్న గోదావరి పుష్కరాల కోసం గోదావరి తీర ప్రాంత గ్రామాలైన మల్లాపూర్ మండలం వాల్గొండ, ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామాల నుండి గోదావరి ఘాట్ల వరకు సిసి రోడ్ల నిర్మాణానికి 5 కోట్ల రూపాయలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసినట్లు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వా డి కృష్ణారావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కోరుట్ల నియోజకవర్గం లోని ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామం నుండి గోదావరి ఘాట్ వరకు సిసి రోడ్డు నిర్మాణం కోసం రెండు కోట్ల రూపాయలు, మల్లాపూర్ మండలంలోని వాల్గొండ గ్రామం నుండి గోదావరి ఘాట్ వరకు సీసీ రోడ్డు నిర్మాణం కోసం మూడు కోట్ల రూపాయలు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో పుష్కర ఘాట్ల వరకు సిసి రోడ్లు నిర్మిస్తామని తెలిపారు. కోరుట్ల నియోజకవర్గంలో గోదావరి పుష్కరాల కోసం గత నెలలో మంజూరైన నిధులకు ఇవి అదనమని తెలిపారు. గోదావరి పుష్కరాల కోసం త్వరలో మరిన్ని నిధులు ప్రభుత్వం ద్వారా మంజూరు చేస్తామని ఆ రోజే తెలిపిన విషయాన్ని జువ్వాడి కృష్ణారావు గుర్తు చేశారు. ఈ నిధులు కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నరసింగరావు ప్రతిపాదనల మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నీటిపారుదల శాఖ ద్వారా ఈ నిధులు మంజూరు చేశారన్నారు. నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి సహకరించిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రపంచానికి ధర్మ మార్గం చూపిన మహనీయుడు వాల్మీకి

**-జగిత్యాల అదనపు కలెక్టర్ ప్రసూనాంబ**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 26 :** ప్రపంచానికి ధర్మం, న్యాయం, సత్యం, సేవా మార్గాలను చాటిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. ప్రసూనాంబ అన్నారు. ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇతిహాస రామాయణ మహాకావ్యాన్ని మానవాళికి అందించిన మహనీయుడు వాల్మీకి అని, అన్నదమ్ముల అనుబంధం, ఇచ్చిన మాటకు కట్టుబడడం, గురుభక్తి వంటి ఆదరణీయ విలువలను రామాయణం ద్వారా తెలియజేశారన్నారు. రామాయణం కేవలం కథ కాదని, ధర్మం, నీతి, స్నేహం, కుటుంబ విలువలను నేర్పే అద్భుత పాఠమని, చెడుపై మంచి విజయం సాధిస్తుందనే సందేశాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, బీసీ వెల్ఫేర్ అధికారి జయరాజ్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్‌లో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



**- రెండు బంగారు పతకాలు, ఒక రజత పతకం కైవసం**

**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం అక్టోబర్ (26) :** జగిత్యాల జిల్లా స్థాయి ఎస్ఏఫ్ అథ్లెటిక్స్ పోటీల్లో ఇబ్రహీంపట్నం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థినులు సత్తా చాటారు. ఆదివారం జగిత్యాల జిల్లా ఎస్కేఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో ముగ్గురు విద్యార్థినులు పతకాలు సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. ఈ పోటీల్లో జె. హిమజ ట్రిపుల్ జంప్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. ఎం. సాహిత్య జావెలిన్ త్రో విభాగంలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని మరో బంగారు పతకాన్ని అందుకుంది. అదేవిధంగా టి. లయ ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించింది. దీంతో పాఠశాల విద్యార్థినులు రెండు బంగారు పతకాలు, ఒక రజత పతకంతో ప్రతిభను చాటారు.పతకాలు సాధించిన విద్యార్థినులు త్వరలో కరీంనగర్‌లో నిర్వహించనున్న జోనల్ స్థాయి పోటీల్లో జగిత్యాల జిల్లా తరఫున పాల్గొననున్నట్లు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ రజిత తెలిపారు. ఈ సందర్భంగా విజేత విద్యార్థినులతో పాటు వారికి శిక్షణ అందించిన పీఈటీ సరితను స్పెషల్ ఆఫీసర్ రజిత, ఉపాధ్యాయులు అభినందించారు. జోనల్ స్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## సమస్యల పరిష్కారానికి
# తక్షణ చర్యలు చేపట్టాలి



**-మండల ప్రజావాణికి ఐదు దరఖాస్తులు**

**-ఇబ్రహింపట్నం ఎంపీడీవో సిహెచ్ గణేష్**

**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం అక్టోబర్ (26) :** ప్రజల సమస్యలను స్థానిక స్థాయిలోనే త్వరితగతిన పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి ఐదువినతులు అందాయి .సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఇబ్రహీంపట్నం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా హౌసింగ్ శాఖకు సంబంధించి రెండు, ఆర్అండ్‌బీ శాఖకు ఒకటి, మిషన్ భగీరథ శాఖకు ఒకటి, పంచాయతీరాజ్ శాఖకు ఒకటి చొప్పున మొత్తం ఐదు దరకాస్తులు అధికారులు స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖలకు పంపించి, సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని ఎంపీడీవో సిహెచ్ గణేష్ అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను పెండింగ్‌లో ఉంచకుండా, సంబంధిత శాఖల అధికారులు త్వరితగతిన పరిష్క రించాలని ఎంపిడిఓ సుచించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయిలోని వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

# గుండ్ల చెరువు కాలువకు ఆక్రమణల అడ్డంకి

**-అలైన్‌మెంట్ మార్చి శాశ్వత నిర్మాణాలు.. చెరువుకు చేరని ఎస్సారెస్పీ నీరు**

**-కాలువ ఆక్రమణలు తొలగించి, మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో ఫిర్యాదు**



**చురకలు ప్రతినిధి హుజూరాబాద్ అక్టోబర్ 26 :** హుజూరాబాద్ పట్టణంలోని గుండ్ల చెరువుకు నీరందించే ఎస్సారెస్పీ ఉపకాలువ ఆక్రమణలకు గురికావడంతో చెరువుకు సాగునీరు చేరడం లేదని గుండ్ల చెరువు రక్షణ సమితి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలువ ఆక్రమణలను తొలగించి, చెరువుకు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని సోమవారం ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గుండ్ల చెరువు కింద వందల ఎకరాల ఆయకట్టు ఉందని, చేపల పెంపకంపై ఆధారపడి 250 ముదిరాజ్ కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని తెలిపారు. ఎస్సారెస్పీ నుంచి వచ్చే 16ఏ ఉపకాలువను పలుచోట్ల ఆక్రమించడంతో పాటు, కాలువ అలైన్‌మెంట్‌ను మార్చి శాశ్వత నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. దీంతో చెరువుకు చేరాల్సిన సాగునీరు చిలుకవాగులోకి వెళ్తోందని పేర్కొన్నారు. మరోవైపు పట్టణంలోని పలు వార్డుల నుంచి మురుగునీరు కాలువలోకి చేరుతుండటంతో నీరు కలుషితమై దుర్వాసన వెదజల్లుతోందని, సమీప ప్రాంతాల ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రెవెన్యూ నక్షా ఆధారంగా కాలువను సర్వే చేసి, ఆక్రమణలను తొలగించి పూర్వపు స్థితికి పునరుద్ధరించాలని కోరారు. మురుగునీరు కాలువలో కలవకుండా ప్రత్యేక డ్రైనేజీ నిర్మించాలని, ఎస్సారెస్పీ ద్వారా వచ్చే సాగునీటిని గుండ్ల చెరువుకు విడుదల చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గుండ్ల చెరువు రక్షణ సమితి నాయకులు సాయికృష్ణ, అభినయ్, పసుల స్వామి, రైతులు క్యాస రమేష్, కొలిపాక చిన్న, దేవుని సమ్మయ్య, రాజు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల త్యాగం చిరస్మరణీయం

**-అమరవీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ : ఎస్సై శేఖర్ రెడ్డి**



**చురకలు ప్రతినిధి హుజూరాబాద్ అక్టోబర్ 26 :** సమాజ శ్రేయస్సు, ప్రజల ప్రశాంతత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించి అమరులైన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని కేశవపట్నం ఎస్సై శేఖర్ రెడ్డి అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కొత్తగట్టు గ్రామంలోని శ్రీ మత్స్యగిరీంద్ర స్వామివారిని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై శేఖర్ రెడ్డి, ఏఎస్ఐ సంపత్‌తో పాటు పోలీస్ సిబ్బంది స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం చైర్మన్ ఉప్పుగళ్ల మల్లారెడ్డి ఎస్సై శేఖర్ రెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరులందరికీ శ్రద్ధాంజలి ఘటించారు. అమరవీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. శ్రీ మత్స్యగిరీంద్ర స్వామివారి ఆశీస్సులతో అమరవీరుల ఆశయ సాధనకు కట్టుబడి, ప్రజల రక్షణ కోసం కేశవపట్నం పోలీస్ శాఖ నిరంతరం సేవలందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సంపత్, పోలీస్ సిబ్బంది, దేవస్థానం చైర్మన్ ఉప్పుగళ్ల మల్లారెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

# వైభవంగా లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

**-పద్మావతి అమ్మవారికి ఒడిబియ్యం,పట్టువస్త్రాల సమర్పణ**

**-సాంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన పద్మశాలి సంఘం పద్మావతి**

**- అమ్మవారిని తమ ఇంటి ఆడపడుచుగా భావించి ప్రతి ఏటా సమర్పణ**



**చురకలు ప్రతినిధి,రాజన్న సిరిసిల్ల జిల్లా అక్టోబర్ 26 :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్వర్యంలో పద్మావతి అమ్మవారికి ఒడిబియ్యం, నూతన పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్పర్సన్ జిందం కళా చక్రపాణి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్‌లతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు,పదుశాలి సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

**మంగళ వాయిద్యాలతోశోభాయాత్ర**

ఉదయం శ్రీ శివభక్త మార్కండేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పద్మశాలి మహిళలు అమ్మవారికి సమర్పించే ఒడిబియ్యాన్ని సాంప్రదాయబద్ధంగా సిద్ధం చేశారు. అక్కడి నుంచి మంగళ వాయిద్యాల నడుమ శోభాయాత్రగా బయలుదేరి శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం స్వామివారితో పాటు లక్ష్మీ, పద్మావతి అమ్మవార్లకు అర్చకుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా ఒడిబియ్యం, నూతన పట్టు వస్త్రాలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పద్మావతి అమ్మవారిని పద్మశాలి వర్గం తమ ఇంటి ఆడపడుచుగా భావించి, ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాల సమయంలో ఒడిబియ్యం, పట్టు వస్త్రాలు సమర్పించడం అనవాయితీగా వస్తోందని తెలిపారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు దూడం శంకర్, ప్రధాన కార్యదర్శి మండల సత్యం మాట్లాడుతూ భక్తులందరిపై లక్ష్మీ వెంకటేశ్వర స్వామి, మార్కండేయ స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్, బొల్లి రామ్మోహన్, పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ గాజుల బాలయ్య, మోద రవి, కోశాధికారి యేళ్ల శ్రీనివాస్, యువజన సంఘం అధ్యక్షుడు సబ్బని హరీష్, మహిళా విభాగం అధ్యక్షురాలు కాముని వనిత, స్థానిక కౌన్సిలర్లు, పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## వీణవంకకు వారం రోజుల్లో డిప్యూటీ తహసీల్దార్

**-అదనపు కలెక్టర్ హామీ**



**చురకలు విలేఖరి వీణవంక అక్టోబర్ 26 :** కరీంనగర్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వీణవంక తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న డిప్యూటీ తహసీల్దార్, సర్వేయర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సామాజిక కార్యకర్త, తెలంగాణ ఉద్యమకారుడు పత్తి వేణుగోపాల్ రెడ్డి అదనపు కలెక్టర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడేకు వినతిపత్రం అందజేశారు.కీలక పోస్టులు ఖాళీగా ఉండటం, సిబ్బంది సెలవుల వల్ల రెవెన్యూ సేవలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. దీనిపై స్పందించిన అదనపు కలెక్టర్ వారం రోజుల్లో వీణవంకకు డిప్యూటీ తహసీల్దార్‌ను నియమిస్తామని హామీ ఇచ్చారు. అలాగే సర్వేయర్ నియామకంతో పాటు పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని వేణుగోపాల్ రెడ్డి కోరారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**చురకలు విలేఖరి వీణవంక అక్టోబర్ 26 :** వీణవంక మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1982-1983 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. 4 దశాబ్దాల తర్వాత ఒకేచోట చేరిన పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి తీపి గుర్తులను, తరగతి గది అనుభవాలను నెమరువేసుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లో, వ్యాపారాల్లో స్థిరపడిన మిత్రులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు తాసీన్ అలీ,మధుసూదన్,వీరాంజనేయులును శాలువాలు,పూలమాలలతో ఘనంగా సన్మానించి ఆశీస్సులు తీసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరుల త్యాగాలు అమోఘం

**-ఏసీపీ మాధవి**



**చురకలు హుజూరాబాద్ అక్టోబర్ 26 :** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం హుజూరాబాద్ పట్టణంలో పోలీసులు,ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో భారీ సైకిల్ ర్యాలీ వైభవంగా నిర్వహించారు. ఈ సైకిల్ ర్యాలీని హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పట్టణ ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ర్యాలీలో యువకులు, పోలీసులు పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ వాసంశెట్టి మాధవి మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాలు, దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధుల్లో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని కొనియాడారు. ప్రతి ఒక్కరూ యూనిఫాం లేని పోలీసులా సమాజ రక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ టౌన్ సీఐ టి. కరుణాకర్, రూరల్ సీఐ వీరబత్తిని శ్రీనివాస్, జమ్మికుంట సీఐలు రామకృష్ణ గౌడ్, పులి వెంకట్ గౌడ్,పలువురు ఎస్సైలు, కౌన్సిలర్లు సొల్లు సునీత, కోయల్ కార్ భారతి, తులసి లక్ష్మణమూర్తి, పోలీసు సిబ్బంది మరియు ప్రజాప్రతినిధులు పాల్గొని అమరులకు ఘన నివాళులర్పించారు.

## నూతన గ్రామపంచాయతీ భవనం మంజూరు చేయాలని వినతి




**చురకలు విలేఖరి వీణవంక అక్టోబర్ 26 :** వీణవంక మండలం లస్మక్కపల్లికి నూతన గ్రామపంచాయతీ భవనాన్ని మంజూరు చేయాలని కోరుతూ 'ప్రజావాణి'లో ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డికి గ్రామ సర్పంచ్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ సోమవారం వినతిపత్రం అందజేశారు. కొత్త గ్రామపంచాయతీ ఏర్పడిన నాటి నుంచి సొంత భవనం లేక స్థానిక పాఠశాల భవనంలోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి, నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం నూతన ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి నీ శాలువాతో సన్మానించారు.

## ప్రిన్సిపాల్ జాతీయస్థాయి పురస్కారం.. కళాశాలలో ఘన సన్మానం



**చురకలు విలేఖరి వీణవంక అక్టోబర్ 26 :** వీణవంక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. కుమార్ జాతీయస్థాయి'విజయదశమి పురస్కారం' అందుకోవడం పట్ల కళాశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో విశేష సేవలకుగాను ఆయనకు స్వర్ణ కంకణంతో పాటు ఈ పురస్కారాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో ప్రిన్సిపాల్ కుమార్‌ను అధ్యాపక, అధ్యాపకేతర బృందం శాలువాతో ఘనంగా సత్కరించింది. ప్రిన్సిపాల్‌కు జాతీయస్థాయి గుర్తింపు లభించడం కళాశాలకే గర్వకారణమని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు రామ్మోహన్, అధ్యాపకులు రవీందర్, శైలజ, సుమలత, కరుణ, స్వప్న, సిబ్బంది తాజుద్దీన్, రాజశేఖర్, విద్యార్థులు ఉన్నారు.

## ఎఎంసి డైరెక్టర్ దండు శ్రీనివాస్‌కు సన్మానం



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డి పేట ఆక్టోబర్ 26 :** ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దండు శ్రీనివాస్‌కు రాచర్ల బోప్పాపూర్ ఏఎంసి డైరెక్టర్‌గా నియామకమైన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి బాల్‌రెడ్డి ఆదివారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ మండల మాజీ అధ్యక్షులు రఫీక్ తదితరులు పాల్గొని దండు శ్రీనివాస్‌ను అభినందనలు తెలిపారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

**-గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 21 ఫిర్యాదులు స్వీకరణ : జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట ఆక్టోబర్ 26 :** ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈరోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 21 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ....ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# డ్రగ్స్,గంజాయి నిర్మూలనకు ప్రత్యేక తనిఖీలు

**-మండల పరిధిలోని కిరాణా,పాన్ షాప్స్, బస్టాండ్ ప్రాంతాలలో నార్కోటిక్ జాగిలంతో తనిఖీలు నిర్వహణ**

**-మత్తు పదార్థాల విక్రయాలు,రవాణాపై కఠిన చర్యలు తప్పవు**






**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 26 :** ఎల్లారెడ్డిపేట మండలంలోని కిరాణా,పాన్ షాప్స్, స్కూల్ ఏరియాలో,బస్టాండ్ పరిసర ప్రాంతాలలో డ్రగ్స్,గంజాయి అక్రమ రవాణా మరియు విక్రయాలను అరికట్టేందుకు జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు ఈరోజు పోలీసు అధికారులు నార్కోటిక్ డాగ్ సహాయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి,అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసులు నిరంతరం ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.ప్రజల సహకారంతోనే మత్తు పదార్థాల నిర్మూలన, భద్రతా చర్యలు మరింత సమర్థవంతంగా కొనసాగుతాయని ఎస్ఐ తెలిపినారు.

# మంథనిలో ఘోర రోడ్డు ప్రమాదం

**-స్పీడ్ బ్రేకర్లు, సిగ్నల్ లైట్లు లేకపోవడంతో ప్రమాదాలు**

**-ఎవరిది ఈ పాపం??? ఇంకా ఎంతమంది బలి కావాలి ???**

**-వెంటనే స్పీడ్ బ్రేకర్లు మరియు సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలి లేకుంటే ధర్నాకైనా సిద్ధం**

**-సామాజిక కార్యకర్త అంబటి నర్సింగ్**



**చురకలు ప్రతినిధి మంథని, అక్టోబర్ 26 :** మంథని పట్టణంలో నిన్న చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో మల్లేపల్లి గ్రామానికి చెందిన చింతల నవీన్ (25) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల ప్రకారం, నవీన్ స్థానిక పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న పండ్ల దుకాణంలో పనిచేస్తున్నాడు. నిన్న మధ్యాహ్నం దాహం వేయడంతో పెట్రోల్ బంక్ లో మంచినీళ్లు తాగేందుకు రోడ్డు దాటుతున్న సమయంలో, అతివేగంగా దూసుకొచ్చిన ఇసుక లారీ అదుపుతప్పి నవీన్ ను బలంగా ఢీకొట్టి టైర్ల కింద నుజ్జు నుజ్జు అయి ఇరుక్కుపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన నవీన్ ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదానికి కారణాలు లారీ డ్రైవర్ అతివేగం ప్రమాదానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. స్పీడ్ బ్రేకర్లు లేక ప్రమాదం జరిగింది పెట్రోల్ బంక్, దుకాణాలు ఉండే రద్దీ ప్రాంతం. అయినప్పటికీ రోడ్డుపై ఎలాంటి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సిగ్నల్ లైట్లు పనిచేయకపోవడం ఆ ప్రాంతంలో సిగ్నల్ లైట్లు ఉన్నప్పటికీ అవి పనిచేయడం లేదు. ట్రాఫిక్ నియంత్రణ లేకపోవడంతో వాహనాలు విచ్చలవిడిగా వెళ్తున్నాయని ప్రజలు వాపోతున్నారు.

**స్థానికుల ఆవేదన:**

"రోడ్లు వేసిన అధికారులు స్పీడ్ బ్రేకర్లు వేయడం మర్చిపోయారా? సిగ్నల్ లైట్లు ఉన్నా వాటిని పట్టించుకునే నాథుడే లేడు. ఒక నిండు ప్రాణం పోయిన తర్వాతే అధికారులకు, నాయకులకు ఈ సమస్యలు గుర్తుకొస్తాయి. ఫోటోలకు ఫోజులు ఇచ్చి మళ్ళీ మర్చిపోతారు" అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న వెంటనే మంథని పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. లారీని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో తక్షణమే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, మొరాయిస్తున్న సిగ్నల్ లైట్లను పునరుద్ధరించాలని, ట్రాఫిక్ నియంత్రణ కఠినతరం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ప్రాణాలను కాపాడటం అందరి బాధ్యత అని వారు గుర్తుచేస్తున్నారు.

# దళితుల సమస్యల పరిష్కారమే దీనబంధు దర్బార్ లక్ష్యం

### -గాంధీభవన్‌లో వినతులు స్వీకరించిన డాక్టర్ కవ్వంపల్లి



**చురకలు విలేఖరి,తిమ్మాపూర్, అక్టోబర్ 26 :** దళితుల సమస్యల పరిష్కారమే దీనబంధు దర్బార్ ప్రధాన లక్ష్యమని టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో దీనబంధు దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ దళితులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని,ముఖ్యంగా భూ సమస్యలు చాలావరకు పరిష్కారా నికి నోచుకోవడం లేదని అన్నారు.దళితుల కు చెందిన వందలాదిఎకరాలభూములు అన్యాక్రాంతానికి గురయ్యాయని, లిడ్‌క్యాప్ భూముల ఉదంతమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.దీనబంధు దర్బార్‌ను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తూ దళితుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. దళిత జాతికి సేవ చేసే అవకాశాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తనకు కల్పించారని, ఈ అవకాశాన్ని అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకువచ్చేందుకు దీనబంధు దర్బార్‌ను వేదికగా ఉపయోగించు కోవాలని ఆయన సూచించారు. ప్రజల నుంచి స్వీకరించిన వినతుల్లోని అంశాలను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు.

# నీటిని కాపాడండి.. భవిష్యత్తును నిలబెట్టండి

### -నీటి పొదుపు.. రేపటి భవితకు మదుపు
### బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్, అధ్యక్షుడు సందెల వెంకన్న



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 26 :** తెలంగాణలో నీటి వనరులను కాపాడుకోవడంతో పాటు ప్రతి నీటి చుక్కను పొదుపు చేయాలని హుజురాబాద్ నియోజకవర్గ బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్, అధ్యక్షుడు సందేల వెంకన్న రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.సోమవారం హుజురాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ..ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సరిగా కురవక, భూగర్భ జలాలు అడుగంటుతున్న పరిస్థితుల్లో నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. నేటి నీటి పొదుపే రేపటి భవిష్యత్తుకు భరోసా అని, ప్రస్తుతం నీటిని వృథా చేస్తే భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రానున్న వేసవిలో తెలంగాణలో నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని, అందువల్ల ప్రజలు ఇప్పటి నుంచే అప్రమత్తమై నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ అవసరమైనంత నీటినే వినియోగించాలని,వర్షపు నీటిని ఒడిసిపట్టే చర్యలు చేపట్టాలని కోరారు. విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు, వర్షాలు పెరుగుదలకు దోహదపడాలని పిలుపునిచ్చారు. ప్రకృతిని కాపాడుతూ భావితరాలకు నీటి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు..'నీరు లేనిదే జీవితం లేదు.. చెట్టు లేనిదే ప్రకృతి పరిరక్షణ లేదు' అనే సత్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని పేర్కొన్నారు. ఈ రోజు మనం తీసుకునే చిన్నపాటి జాగ్రత్తలు రేపటి తరాలకు గొప్ప వరంగా మారుతాయని తెలిపారు. 'నీటిని కాపాడుదాం..చెట్లను పెంచుదాం..తెలంగాణను పచ్చగా మార్చి పరిరక్షిద్దాం'అనే నినాదాన్ని ఆచరణలో పెట్టాలని కోరారు. ప్రజాప్రతినిధులు,అధికారులు నీటి పొదుపుపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని, ప్రతి పౌరుడు నీటి విలువను గుర్తించేలా బాధ్యతాయుతంగా ముందుకు సాగాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు వన్నాల శివాజీ, బీసీ జేఏసీ ప్రధాన కార్యదర్శి ఇప్పకాయల సాగర్ (ఈవీఎస్), ఉపాధ్యక్షులు మామునూరి ప్రవీణ్ కుమార్, కొలిపాక క్రాంతి కుమార్, గొర్రె చిరంజీవి, కే. ఆదామ్, కుడికాల ప్రభాకర్, పిట్ట శ్రీనివాస్, తూముల రాజు తదితరులు పాల్గొన్నారు.

## మంథని మున్సిపల్ పాలకవర్గాన్ని సత్కరించిన ఇనుముల సతీష్



**చురకలు ప్రతినిధి మంథని, అక్టోబర్ 26 :** మంథని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ లుగా ఎన్నికై 8 నెలలు పూర్తైన సందర్భంగా, ఇటీవల బతుకమ్మ, దసరా పండుగ వేడుకలను విజయవంతంగా నిర్వహించిన పాలకవర్గాన్ని న్యాయవాది, మాజీ ఉపసర్పంచ్ ఇనుముల సతీష్ (సత్యనారాయణ) సత్కరించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్,వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి,13వ వార్డు కౌన్సిలర్ యెల్లంకి వంశీ,10వ వార్డు కౌన్సిలర్ పెంటరి రాజులకు శాలువాల తో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మంథని మున్సిపాలిటీని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లి, పట్టణం లో పరిశుభ్రత,పచ్చదనం, సుందరీ కరణపై దృష్టి పెట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు,శ్రీలక్ష్మీ నారాయణ స్వామి దేవాలయ డైరెక్టర్ వేల్పుల సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కు చెల్లించుకున్న నాగర్ కర్నూల్ జడ్జి



**చురకలు ప్రతినిధి,కమాన్‌పూర్ అక్టోబర్ 26 :** నాగర్ కర్నూల్ జిల్లా జడ్జి నసీమా సుల్తానా మొక్కు చెల్లించు కున్నారు.రంగారెడ్డి జిల్లా శంషాబాద్ వద్ద గల జహంగీర్ పీరా దర్గా వద్ద ఆమె మొక్కులు చెల్లించుకున్నారు. దర్గా పై పూలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలను చేశారు.అనంతరం పేదల కు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిం చారు.ఆమె వెంట సులేమాన్ ఖాన్, అయాన్ ఖాన్,మొహమ్మద్ అబ్దుల్ మతిన్,నసీం,ఫలక్ పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎంపీ వంశీకృష్ణ



**చురకలు ప్రతినిధి మంథని,అక్టోబర్ 26 :** పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ సోమవారం మంథని పట్టణంలో పలు మృతుల కుటుంబాలను పరామర్శించారు. సీనియర్ జర్నలిస్ట్, పెద్దపల్లి జిల్లా ఎథిక్స్ కమిటీ చైర్మన్, మంథని ఆంధ్రజ్యోతి ఇంచార్జ్ పోతరాజు సమ్మయ్య తల్లి వెంకటమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.అలాగే సీనియర్ జర్నలిస్ట్ పెండ్యాల రామకుమార్ తండ్రి తిరుమలయ్య కూడా ఇటీవల మృతి చెందడంతో విషయం తెలుసుకున్న ఎంపీ వంశీకృష్ణ వారి నివాసాలకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ప్రగాఢ సానుభూతి తెలిపి, ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. గోదావరిఖని ఏ సి పి మడత రమేష్, మంథని పాత్రికేయుల బృందం పరామర్శించారు. వెంకటమ్మ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఆమె మృతి పట్ల విచారణ వ్యక్తం చేశారు.కుటుంబ సభ్యులైన పోతరాజు శ్రీనివాస్,వెంకటేష్, వెంకటలక్ష్మి, తిరుమల,స్వప్నలను ఓదార్చి తమ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు,మాల సంఘం నాయకులు ఎడ్ల కిష్టయ్య ఉన్నారు.

## మెగా ఫీల్డ్ డే



**చురకలు ప్రతినిధి మంథని,అక్టోబర్ 26 :** ఎల్ ఎస్ ఆర్ సీడ్స్ వారి ఆధ్వర్యంలో "ఫిదా" బీజీ 2,అనే పత్తి రకాన్ని సోమవారం ప్రదర్శించడం జరిగింది.మంథని మండలం పోతారం గ్రామంలో ఎడ్ల మల్లికార్జున్ పత్తి చేనులో నిర్వహించడం జరిగింది.7 గ్రామాల రైతులు సుమారు 208మంది వీక్షించడం జరిగింది.దీంట్లో కంపెనీ ప్రతినిధులు నాంపల్లి తిరుపతి,డీలర్ మార్కండేయ ఫెర్టిలైజర్స్, రైతులు పాల్గొనడం జరిగింది.కంపెనీ ప్రతినిధులు వచ్చి నాంపల్లి తిరుపతి మాట్లాడుతూ "ఫిదా "బీజీ 2 అనే విత్తనాలు చాలా బరువైన కాయ పెద్ద కాయలు,ఎక్కువ కొమ్మలు వస్తుంది.అలాగే దిగుబడిని ఎక్కువగా ఇస్తుంది.అలాగే పురుగు, దోమ,పేను బంక మొదలగు తెగుళ్ళని తట్టుకోగల శక్తి ఉన్నది అని వెల్లడించారు. రైతు ఎడ్ల మల్లికార్జున్,సర్పంచ్ ఎడ్ల ఆదిత్య మాట్లాడుతూ రైతులు ఎల్ ఎస్ ఆర్ సీడ్స్ పత్తి రకాలను వేసుకోవాలి అని వచ్చినటువంటి రైతులకు చెప్పి సంతోషాన్ని వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సేల్స్‌ఆఫీసర్ పాలమాకుల జీవన్,తదితరులు పాల్గొన్నారు.

## ఛత్తీస్గడ్ ప్రభుత్వం రివార్డు అందజేయాలి



**చురకలు (పెద్దపల్లి జిల్లాప్రతినిధి) కమాన్‌పూర్ అక్టోబర్ 26 :** లొంగిపోయిన నక్సలైట్లకు చత్తీస్గడ్ ప్రభుత్వం రివార్డు అంద జేయాలి అని మాజీ మావోయిస్టులు ఆరెల్లి కొమురయ్య గౌడ్, సుదర్శన్ ఛత్తీస్‌గడ్ ప్రభుత్వాన్ని కోరారు.దళంలో ఉన్న సమయం లో చత్తీస్గఢ్ ప్రభుత్వం లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డులు ఇచ్చి ప్రోత్సాహి స్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు ఆ ప్రభుత్వం నెరవేర్చలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మూడు సంవత్సరాలు గడిచిన సుదర్శన్‌కు రివార్డ్ ఇవ్వకపోవడం శోచనీయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో మాత్రం రేవంత్ రెడ్డి లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు అందజేయడం జరుగుతుందని వారు తెలిపారు. చత్తీస్గడ్ ప్రభుత్వం మాత్రం మావోయిస్టులను ఏమాత్రం పట్టించుకోకుండా చూస్తోందని ప్రస్తుతం ఎటువంటి ఉపాధి లేక సాధారణ జీవితాన్ని గడపడం జరుగుతుందని వెంటనే ప్రభుత్వం రివార్డు అందజేయాలని పేర్కొన్నారు.

# పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

**-ఎమ్మెల్సీ ఎన్నికల సన్నద్ధతపై జనగామ నాయకులతో సమీక్ష**
**- నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పనిచేయాలి**
**జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బండ శ్రీనివాస్**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 26 :** వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ పార్టీ శ్రేణు లకు సూచించారు. అర్హులైన పట్టభద్రులం దరికీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించి, ప్రతి ఒక్కరూ తమ పేరును నమోదు చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు చొరవ తీసుకోవాలన్నారు. సోమవారం జనగామ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జనగామ మండల, పట్టణ బీఆర్ఎస్ నాయకులతో ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నద్ధత, పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై సమీక్షించారు. ఈ సందర్భంగా అర్హులైన పట్టభద్రులను గుర్తించడం, ఓటరు నమోదుకు అవసరమైన సమాచారం అందించడం, నమోదు ప్రక్రియపై విస్తృతంగా ప్రచారం చేయడం వంటి అంశాలపై చర్చించారు. పట్టభద్రుల ఓటరు నమోదులో ఎలాంటి అర్హులు మిగిలిపోకుండా నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అవగాహన కల్పిం చాలని బండ శ్రీనివాస్ సూచించారు. మండల, పట్టణ స్థాయిలో సమ న్వయంతో పనిచేస్తూ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పార్టీ చేపట్టాల్సిన కార్యక్రమాలను ప్రణా ళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవసరమైన సహ కారం అందించాలని పార్టీ నాయకులకు సూచించారు. ఈ సమావేశంలో పట్టణ తాళ్ల సురేష్ రెడ్డి, మాజి మున్సిపల్ ఛైర్మన్ లు గాడిపెల్లి ప్రేమలతా రెడ్డి, పోకల జమున, మున్సిపల్ వైస్ ఛైర్మన్ బుషా పర్వతాలు, కౌన్సిలర్ లు దుర్గాప్రసాద్, పానుగంటి సువార్త,పార్టీ నాయకులు కదిరే రాజశేఖర్ రెడ్డి, సమద్, అనిత, మామిడాల రాజు, రావెల రవి, మల్లే శం, కృష్ణ, కొమ్ము రాజు, శారద, నీలా యాదగిరి, ఇరుగు సిద్దులు, బిజ్జల నవీ న్, ధర్మపురి శ్రీనివాస్, అన్వర్, దండు ఉపేందర్, సలీం వార్డు కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ చైతన్యలో ఓరియంటేషన్ ప్రోగ్రాం



**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ అక్టోబర్ 26 :** విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే శ్రీ చైతన్య కళాశాల లక్ష్యమని కళాశాల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి కాలనీ లోని శ్రీ చైతన్య ఫార్మసీ కళాశాలలో ఫాం బి,ఫాం డి మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డిహాజరయ్యారు. కొత్తగా ప్రవేశం పొందిన విద్యార్థులు, తల్లిదండ్రులకు కళాశాల యాజమాన్యం స్వాగతం పలికింది. ఈ సందర్భంగా రమేష్ రెడ్డి మాట్లాడుతూ..ఫార్మసీ కోర్సు ప్రాముఖ్యత, భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు, కళాశాలలో ఉన్న ల్యాబ్, లైబ్రరీ సౌకర్యాలు, క్రమశిక్షణ నియమాల వివరించారు. ఫార్మసీ విద్య ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన బాధ్యత అనివిద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. తమ కళాశాలలో విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. శ్రీచైతన్య విద్యార్థులు చైతన్య వంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కర్ర నరెందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ రామ నర్సింహ రెడ్డి, హెచ్ఓడి డాక్టర్ రవిందర్ రెడ్డి, డాక్టర్ చంద్రమౌళి, మిడియా కో ఆర్డినేటర్ గొంటి రమేష్, విద్యార్థులు, తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# రామగిరి ఖిల్లా ట్రెక్కింగ్ చేసిన ఎంపి వంశీకృష్ణ

**-యువతకు సవాల్.. గెలిచిన వారికి వన్‌ప్లస్ ఫోన్ గిఫ్ట్**
**-10 కిలోమీటర్లు కాలినడకన రామగిరి కిలా ఎక్కిన ఎంపీ వంశీ.... ఏడు గేట్లు, రెండు సరస్సులు దాటి.. నాలుగు గుట్టలు అధిరోహించి రాములవారి, శివాలయాల దర్శనం**
**-రామగిరి ఖిల్లాకు రోప్‌వే మంజూరు చేయించిన వంశీ పర్యాటక అభివృద్ధికి బాటలు**



**చురకలు (పెద్దపల్లి జిల్లా ప్రతినిధి) కమాన్ పూర్ అక్టోబర్ 26 :** చారిత్రక రామగిరి ఖిల్లాకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. రామగిరి ఖిల్లా అభివృద్ధి, పర్యాటక రంగం విస్తరణకు కృషి చేస్తున్న ఎంపీ.. సోమవారం రామగిరి ప్రాంతంలో సుమారు 10 కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించి, ఖిల్లా పూర్తి ప్రాంతాన్ని సందర్శించారు. ఏడు గేట్లు దాటి, రెండు సరస్సులను అధిగమించి, నాలుగు గుట్టలను అధిరోహిస్తూ అత్యంత సాహసోపేతంగా ఖిల్లా పైభాగానికి చేరుకున్న ఎంపీ వంశీకృష్ణ అక్కడి శివాలయం, శ్రీరామచంద్ర స్వామి ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామగిరి ఖిల్లాలోని చారిత్రక కట్టడాలు, పురాతన ఆలయాలు, ప్రకృతి అందాలను స్వయంగా పరిశీలించారు.

**రామగిరి ఖిల్లాకు రోప్‌వే.. పర్యాటక అభివృద్ధికి కొత్త దిశ!**

రామగిరి ఖిల్లా పర్యాటక అభివృద్ధికి కీలకమైన రోప్‌వే ఏర్పాటుకు కేంద్ర స్థాయిలో కృషి చేసి నిధుల మంజూరుకు చొరవ తీసుకోవడం ద్వారా ఎంపీ గడ్డం వంశీకృష్ణ గారు ఈ ప్రాంత అభివృద్ధిపై తన నిబద్ధతను చాటుకున్నారు. రోప్‌వే అందుబాటులోకి వస్తే పర్యాటకులు ఖిల్లాను సందర్శించడం మరింత సులభతరం కానుంది. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, పిల్లలు సైతం చారిత్రక ఖిల్లాను సులభంగా సందర్శించే అవకాశం కలుగుతుంది. దీంతో మంథని ప్రాంతానికి పర్యాటక రంగంలో ప్రత్యేక గుర్తింపు లభించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది.

**ట్రెక్కింగ్ చేసిన వంశీకృష్ణ..**

**యువతకు సవాల్.. విజేతకు వన్‌ప్లస్ ఫోన్ గిఫ్ట్!**

రామగిరి ఖిల్లాలో సుమారు 10 కిలోమీటర్ల మేర సాహసోపేతంగా ట్రెక్కింగ్ చేసిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ గారు యువతకు స్ఫూర్తినిస్తూ ట్రెక్కింగ్ సవాల్ విసిరారు. యువతలో సాహస క్రీడలు, ఫిట్‌నెస్ పట్ల ఆసక్తిని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ సవాల్‌ను ముందుకు తీసుకువచ్చారు. ఈ సవాల్‌లో విజేతగా నిలిచిన వారికి వన్‌ప్లస్ ఫోన్‌ను బహుమతిగా అందించనున్నట్లు ప్రకటించారు.

**చారిత్రక సంపదకు కొత్త వెలుగు.. పర్యాటక అభివృద్ధికి కొత్త దారి!**

రామగిరి ఖిల్లా తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తోంది. ఇక్కడి పురాతన ఆలయాలు, కోట నిర్మాణాలు, ప్రకృతి అందాలను ప్రపంచానికి పరిచయం చేయాలనే లక్ష్యంతో ఎంపీ గడ్డం వంశీకృష్ణ చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయం. రాములవారి దర్శనం నుంచి ఖిల్లా పైభాగంలోని శివాలయం, శ్రీరామచంద్ర ఆలయాల సందర్శన వరకు సాగిన ఎంపీ పర్యటన రామగిరి ప్రాంత అభివృద్ధిపై ఆయన చూపుతున్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనంగా నిలిచింది. రామగిరి ఖిల్లాకు ప్రపంచస్థాయి గుర్తింపు.. మంథని ప్రాంతానికి పర్యాటక వైభవం తీసుకురావడమే లక్ష్యంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ గారు ముందుకు సాగుతున్నారు.



# ఎల్లమ్మ తల్లి ఆలయ షెడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు



**-బండి సంజయ్‌కు గౌడ సంఘం కృతజ్ఞతలు**
**-కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులు ప్రారంభించిన సర్పంచ్ బోనాల మణెమ్మ**

**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట ఆక్టోబర్ 26 :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామంలోని ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద షెడ్డు నిర్మాణానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రూ.5 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో చేపట్టనున్న షెడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ బోనాల మణెమ్మ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి వచ్చే భక్తులకు, ప్రత్యేక పూజలు నిర్వహించే సందర్భాల్లో ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా షెడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం పట్ల గ్రామస్తులు, గౌడ సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు రామచంద్రం, బుగ్గారెడ్డి, బోనాల సాయికుమార్, నరేష్, పరశు రాం, గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, వెంకటస్వామి, రంగయ్య, మల్లేశం, ఎల్లాగౌడ్, జవ్వాజి రాజు, పెద్ద మల్లేశం తదితర గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు. ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద షెడ్డు నిర్మాణానికి రూ.5 లక్షల నిధులు మంజూరు చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు గౌడ సంఘం సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.